క్లుప్తంగా

పనులు పూర్తి చేయండి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం నిర్దేశించిన పనులు వేగంగా పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ యాదగిరిరెడ్డి అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిశుభ్రత చర్యలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందిస్తున్న సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): అత్యవసర చికిత్స కోసం మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు రూ.2,50,000 శుక్రవారం ముషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఎల్‌ఓసీ అందజేశారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): రైతులకు పంటల సాగుపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట రైతు వేదికలో రైతులకు ఆయిల్ పామ్ సాగుతో పాటు వ్యవసాయ రుణాల రెన్యువల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఓ రాజేశ్ కుమార్, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, పీఏసీఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ కృష్ణ, ఎస్‌బీఐ ఏపీ జీవీబీ మేనేజర్లు, ఏఈఓలు స్వాతి, మమత పాల్గొన్నారు.
అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గడి పెద్దాపూర్ రైతు వేదికలో శుక్రవారం క్లస్టర్ రైతులకు ఆయిల్ పాం సాగుపై అవగాహన కల్పించారు. ఈ పంటల సాగుతో వచ్చే లాభాలను రైతులకు వివరించారు. ఏఓ రాజేశ్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, బ్యాంకు అధికారులు, రైతులు సుధాకర్, అభిలాశ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ వద్ద పడిగాపులు



నర్సాపూర్: పట్టణంలోని ఆధార్ సెంటర్‌కు ప్రజలు ఉదయమే వచ్చి నిరీక్షిస్తున్నారు. ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవడం, మొబైల్ నంబర్ లింకు చేయించుకోవడం, బయో మెట్రిక్ చేసుకునేందుకు ప్రజలు ఆధార్ కార్డు సెంటర్‌కు ఉదయం ఆరు, ఏడు గంటల నుంచి వచ్చి నిరీక్షిస్తున్నారు. దీంతో సెంటర్ నిర్వాహకులు సైతం ఉదయమే వచ్చి కూపన్లు అందజేస్తున్నారు. పట్టణంతో పాటు మండలాల్లోని గ్రామాల ప్రజలు రావడంతో కూడా రద్దీ ఎక్కువవుతుంది.

బక్కి వెంకటయ్యను కలిసిన జెడ్పీ చైర్ పర్సన్



మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైన బక్కి వెంకటయ్యను జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వీరి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రంగౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

ఎస్సీవర్గీకరణ వెంటనే చేయాలి

మెదక్ కలెక్టరేట్: ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం మెదక్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు యాదగిరి, బాలరాజ్, ప్రవీణ్ కుమార్, యాదగిరి మాదిగ, మురళి మాదిగ, సంజీవులు ప్రభాకర్, ప్రమీల మాదిగ పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం

చిన్నశంకరంపేట(మెదక్): పంచాయతీ కార్యదర్శులు విధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఎంపీఓ గిరిధర్‌రెడి పాల్గొన్నారు.

విద్యుత్ సేవలేవీ..?

- అధికారుల తీరుపై మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- గైర్హాజరైన అధికారులపై చర్యకు తీర్మానం


మాట్లాడుతున్న ఎంపీపీ శేరి నారాయణరెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని వాడి, నాగాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని సర్పంచ్‌లు యామిరెడ్డి, రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకుండా కింది స్థాయి అధికారులను పంపించడం ఏమిటని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ శేరి నారాయణరెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ అధికారులు వీధి దీపాల కోసం ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయకపోవడం వల్ల వీధిదీపాలు రోజంతా వెలిగి కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందన్నారు. ఏఈ వినోద్ మాట్లాడుతూ.. త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలంలో ఫారెస్ట్ శాఖతో గ్రామాల్లో అనేక సమస్యలున్నాయని, వీటిని పరిష్కరించేందుకు ఎఫ్ఆర్‌వో హాజరు కాకుండా బీట్ ఆఫీసర్‌ను పంపిస్తే సమస్యను ఎలా పరిష్కరిస్తారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశంలో కూడా ఫారెస్టు అధికారులు రాకుండా ప్రతీసారి ఇలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సభ్యులు పేర్కొన్నారు. మండల అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమస్యలను పట్టించుకోకుంటే సామాన్య ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఎంపీపీ శేరి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల్లో ఏ కార్యక్రమాలున్నా.. ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. మన ఊరు – మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో మిగతా పనులు చేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదని, బిల్లులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. ఎంఈవో నీలకంఠం మాట్లాడుతూ.. బిల్లుల విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో బిల్లులు వచ్చేలా చూస్తానని హామీనిచ్చారని తెలిపారు. సర్పంచ్ సుభాశ్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని సర్దన గ్రామంలో కెనాల్ పనులను సగం వరకే పూర్తి చేసి, వదిలివేయడం కారణంగా ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇరిగేషన్ జేఏఈ శ్రీహరి మాట్లాడుతూ.. ఇప్పటికే కెనాల్ ద్వారా వచ్చిన నీటిని గ్రామం బయటకు పంపించేందుకు జేసీబీతో పాటు కూలీలను పెట్టి నీటిని తరలించామని తెలిపారు. డాక్టర్ వినయ్ మాట్లాడుతూ.. సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్ మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మండలంలోని ప్రజలకు ఏదైనా చికిత్స అవసరం ఉంటే తమను సంప్రదిస్తే సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు ఖాలేద్, వైస్ ఎంపీపీ రాధాకిషన్ యాదవ్, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీఓ శ్రీరామ్, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

సంపద వనాలతో గ్రామాలకు ఆదాయం


నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): సంపద వనాలతో గ్రామాలకు ఆదాయం లభిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాశ్ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి ఐబీ కార్యాలయం వద్ద సంపద వనాలలో భాగంగా మొక్కలు నాటుతుండగా పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కూకుట్లపల్లి, లింగంపల్లి, ధర్మాసాగర్, కౌడిపల్లి గ్రామాల్లో సంపద వనాలు ఏర్పాటు చేశామన్నారు. నాటిన ప్రతీ మొక్కను రక్షించి ఏపుగా పెరిగేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశం, రాజిరెడ్డి, కారోబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయండి


బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

నర్సాపూర్: ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని, వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 12వ రోజుకు చేరింది. కాగా పట్టణంలో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వద్ద శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బతుకమ్మ ఆడుతూ తమ నిరసనలు తెలిపారు. వారికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. సమ్మెలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ ఆయా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలో చేపట్టిన రెండు రోజుల సమ్మెకు పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మెదక్‌కు తరలి వెళ్లారు.
రామాయంపేట(మెదక్): అంగన్‌వాడీ టీచర్లు రామాయంపేటలో సమ్మె నిర్వహిస్తున్నారు. ఆందోళనలో పాల్గొన్న పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లాడి వెంటకేశ్, నాయకులు శివ, సత్యం పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించండి


మాట్లాడుతున్న డీపీఎం మోహన్

శివ్వంపేట(నర్సాపూర్): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తేనే కొత్త గ్రూపులకు రుణాలు ఇచ్చేందుకు ఆస్కారం ఉంటుందని డీపీఎం మోహన్ అన్నారు. శుక్రవారం శివ్వంపేట మండల ఐకేపీ 15వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సంవత్సర కాలంలో గ్రూపులకు ఇచ్చిన రుణాలు, ఖర్చులు, పొదుపు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం డీపీఎం మాట్లాడుతూ.. డ్వాకా సంఘాలు తీసుకున్న రుణాల ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందన్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తేనే ప్రభుత్వం నుంచి పావల వడ్డీ వర్తిస్తుందని చెప్పారు. ఏపీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో 891 గ్రూపులు ఉన్నాయని, మరికొన్ని కొత్త గ్రూపులు చేర్చేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పోషణ అభియాన్ గురించి మండల అంగన్‌వాడీ సూపర్ వైజర్ సంతోష వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు నవనీత, కార్యదర్శి జ్యోతి తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి, సంరక్షించండి

మనోహరాబాద్(తూప్రాన్): హరితహారం మొక్కల ప్రాముఖ్యతపై గ్రామస్తులకు కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కళాజాత బృందం అవగాహన కల్పించారు. మండలంలోని గౌతోజీగూడెంలో కళాజాత బృందం పాటలు పాడుతూ అలరించారు. హరితహారంలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం వల్ల ఉపయోగాలు, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేణుకుమార్, కార్యదర్శి నందిని, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశ్, సీనియర్ మేట్ నాగమణి, గ్రామస్తులు ఉన్నారు.

సాదాసీదాగా సోషల్‌ఆడిట్

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా నిర్వహించారు. ఎంపీపీ మంజుల అధ్యక్షతన కొల్చారంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావేదికలో 2021 జూలై నుంచి 2023 మార్చ్ 31 వరకు మండలంలో చేపట్టిన వివిధ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. మొదట సీఆర్పీలు ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై తమ నివేదికలను చదివి వినిపించారు. పై మొత్తం కాలానికి గాను ఉపాధి హామీ కింద రూ.5 కోట్ల 58 లక్షల 4వేల 960లను పనుల కోసం ఖర్చు చేశారు. ఈ మొత్తంలో రూ.13,788లు కూలీలు, సిబ్బంది, గ్రామ పంచాయతీలో నుంచి రికవరీ చేయుటకు అధికారులు ఆదేశించారు. రూ.6వేలు సిబ్బందికి పెనాల్టీ విధించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ విరోజా, డీవీఓ శ్రీహరి, క్వాలిటీ కంట్రోలర్ రమాకాంత్, సంపత్, ఎంపీడీఓ గణేశ్ రెడ్డి, ఏపీఓ మహిపాల్ రెడ్డి, గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గణనాథునికి ఘనంగా పూజలు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వివిధ గ్రామాల్లో గణనాథునికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని గణేశ్ మంటపాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.


రామాయంపేట వినాయక విగ్రహం వద్ద ఎంపీడీఓ, తదితరులు


రామాయంపేట(మెదక్): ఝాన్సిలింగాపూర్‌లో వినాయకుడిని ఎడ్లబండిలో తరలిస్తున్న భక్తులు


కౌడిపల్లి(నర్సాపూర్): వెంకట్రావ్‌పేటగేట్ వద్ద వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

వందశాతం పన్నులు వసూలు చేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో హరితహారం లక్ష్యం మేరకు మొక్కలు నాటి, ప్రతీ మొక్కను రక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఏపీఓ పుణ్యదాస్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): వరిలో మొగిపురుగును నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలని కేవీకే విద్యార్థులు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని తునికి డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శిక్షణ పొందుతున్న గ్రీన్‌ఫీల్డ్స్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తిరుమలరెడ్డి, చిన్ని ప్రశాంత్, నీరుడి ప్రశాంత్, అఖిల్‌కుమార్, చందు వెంకట్రావ్‌పేటలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. వరిని ఆశించిన మొగి పురుగు నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు పొలంలో చల్లుకోవాలన్నారు. సకాలంలో కలుపు తీసుకోవాలని, ప్రతీ రోజు పంటను పరిశీలిస్తూ ఉండాలన్నారు. రైతులు, కేవీకే శాస్త్రవేత్త శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించండి



శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావుకు జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో రాష్ట్ర మంత్రిని కలిసి పలు సమస్యలపై చర్చించారు.

ముమ్మరంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు


కౌడిపల్లి(నర్సాపూర్): గెలుపొందిన విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ (స్కూల గ్రేమ్స్ ఫెడరేషన్) బాలికల క్రీడాపోటీలు ముమ్మరంగా జరిగాయి. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అండర్ 14 కబడ్డీలో కౌడిపల్లి ప్రథమ, భుజిరంపేట ద్వితీయ బహుమతి గెలుపొందారు. ఖోఖోలో భుజిరంపేట, వెల్మకన్న, వాలీబాల్‌లో భుజిరంపేట, కంచన్‌పల్లి అండర్ 17 కబడ్డీలో భుజిరంపేట, కౌడిపల్లి, ఖోఖోలో భుజిరంపేట, వెల్మకన్న, వాలీబాల్‌లో భుజిరంపేట, కంచన్‌పల్లి పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. కార్యక్రమంలో హెచ్ఎం మహాపుజొద్దీన్, పీడీ రమేశ్, పీఈటీలు మహిపాల్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.
వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీల సందడి నెలకొంది. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి సెలక్షన్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఆయా విభాగాల్లో మెదక్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్వేత కుమారి తెలిపారు. హెచ్ఎం మీర్‌ముంతాజ్ అలీ ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, నరేందర్‌రావు, భాషా, సంతోష్, సుదీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లకు ఆలుగుపారుతున్న పెద్ద చెరువు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట పెద్ద చెరువు ఏడేళ్లకు ఆలుగు పారుతుంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి గాను చెరువు నిండి మత్తడి దూకుతుంది. దీంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఉప సర్పంచ్ పద్మ ఆధ్వర్యంలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీనివాస్

రామాయంపేట(మెదక్): మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి ఆర్థిక స్వాలంబనతో ముందుకెళ్తున్నారని డీఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. నార్సింగి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రుణాల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సబిత, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లింగారెడ్డి, తహసీల్దార్ కరీం పాల్గొన్నారు.
చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల సమాఖ్య 6వ వార్షిక మహాసభను మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రేమలత, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీదుర్గారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి, మహిళా సభ్యులు సుజాత, సుధారాణి, పుష్పమ్మ, వీరమణి, సీసీలు పాల్గొన్నారు.
వెల్దుర్తి(తూప్రాన్): మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ స్వరూపరెడ్డి, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ అన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం కింద దామరంచ పంచాయతీ పరిధిలోని అక్కంపల్లిలో ఏర్పాటు చేసిన పిండి, కారం మిల్లులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, ఏపీఎం శంకరయ్య, డీపీఎం, బ్యాంక్ మేనేజర్ రాహుల్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.
వెల్దుర్తి(తూప్రాన్): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మహిళా సమైఖ్య సభ్యులకు ప్రత్యేక రుణాలు కేటాయిస్తున్నారని ఎంపీపీ స్వరూపరెడ్డి సూచించారు. వెల్దుర్తి మహిళా సమైఖ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన 15వ వార్షిక మహాసభ సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, బీఎల్ డీపీఎం వెంకట్, స్త్రీనిధి రిజినల్ మేనేజర్ గంగారాం, ఎస్సై మధుసూదన్‌గౌడ్, ఏపీఎం శంకరయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు భవాని పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యలు పరిష్కరించండి
శివ్వంపేట(నర్సాపూర్): ఆశ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సమ్మె నోటిసు అందజేశారు. ఈ నెల 25 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు సంబంధించి పీహెచ్‌సీ వైద్యులు సాయిసౌమ్య, సంధ్యలకు వినతిపత్రం అందజేశారు. 18 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వం సరైన వేతనాలు ఇవ్వడం లేదని ఆశ వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు గోపమ్మ, ప్రధాన కార్యదర్శి రేణుక అన్నారు. ఆశలపై పనిభారం తగ్గించి జామ్‌చార్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆశ సిబ్బంది ఉన్నారు.

◆ ఎంపీపీపై కేసు నమోదు చేయాలి
చేగుంట(తూప్రాన్): సాక్షి విలేకరిపై దాడి చేసిన అల్లాదుర్గం ఎంపీపీ అనీల్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని బీఎస్పీ మండలాధ్యక్షుడు బాలచందర్ అన్నారు. చేగుంటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అల్లాదుర్గం విలేకరిపై ఎంపీపీ దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

◆ మండలానికి 6 మంది కొత్త హెచ్‌ఎంలు
నర్సాపూర్ రూరల్: మండలానికి ఇటీవల జరిగిన బదిలీల్లో ఆరు జెడ్పీ పాఠశాలలకు ఆరు మంది కొత్త హెచ్‌ఎంలు వచ్చినట్లు ఎంఈఓ బుచ్చనాయక్ శుక్రవారం తెలిపారు.

◆ సేవాగుణం చాలా గొప్పది
వెల్దుర్తి(తూప్రాన్): సేవాగుణం చాలా గొప్పదని సర్పంచ్ భాగ్యలక్ష్మి అన్నారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, వెల్దుర్తి గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ అసెంబ్లీ డ్రమ్స్ బహూకరించారు. హెచ్ఎం సాంబయ్య, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశం, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎస్‌జీఎఫ్ విజేత కొత్తపల్లి
పాపన్నపేట(మెదక్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల కబడ్డీ పోటీలో కొత్తపల్లి జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం కుర్తివాడ విజయం సాధించింది. అండర్ 17 బాలికల విభాగంలో మొదటి స్థానంలో పొడిచన్‌పల్లి, ద్వితీయ స్థానంలో కొత్తపల్లి, అండర్ 14 బాలికల విభాగంలో పొడిచన్‌పల్లి, కొత్తపల్లి, అండర్ 14 బాలుర విభాగంలో కొత్తపల్లి, పాపన్నపేట, విజేతలుగా నిలిచాయి.

◆ కొండాపూర్ మహారాజ్‌కి ఘన స్వాగతం
పెద్దశంకరంపేట(మెదక్): మధ్యప్రదేశ్‌లోని ఆదిశంకరాచార్యుల 108 అడుగుల ఏక శిలా విగ్రహావిష్కరణకు మధ్యప్రదేశ్ సీఎం పిలుపుమేరకు విగ్రహావిష్కరణకు వెళ్లి, వచ్చిన సందర్భంగా కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్‌కు మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో హిందూ సంఘాల బాధ్యులు సర్వేశ్వర్ ముదిరాజ్, మహంకాళి కష్టమూర్తి, సతీశ్ గౌడ్, సీతారామరావు దేశ్‌పాండే, రవివర్మ, బండల శ్రవణ్, రమేశ్, సిద్ధు, శ్రీహరి, లోకేశ్, క్రాంతిలాల్, సంతోశ్, వినోద్,అన్నరం మురళి, నాగరాజు, హిందూ సంఘాల యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

◆ మురళీయాదవ్ కోలుకోవాలని పూజలు
చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ త్వరగా కోలుకోవాలని మండలంలోని చిట్కుల్ శ్రీచాముండేశ్వరీదేవి ఆలయంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు సత్యం ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, నాయకులు కిషన్‌నాయక్, వెంకటేశం, శ్రీనివాస్, ఆనంద్, నాగేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ మనోహరాబాద్ ఎంపీపీగా సతీశ్
మనోహరాబాద్(తూప్రాన్): బదిలీలో భాగంగా నార్సింగి ఎంపీఓగా పని చేస్తున్న సతీశ్ గురువారం మనోహరాబాద్ మండల ఎంపీఓగా బాధ్యతలు తీసుకున్నారు.

◆ సాగు చేసేందుకు చర్యలు
తూప్రాన్: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ స్వప్న అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి నర్సయ్య మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేపట్టేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎంపీడీఓ అరుంధతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ ఎరువుల కొరత లేకుండా చూడండి
చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని ఆగ్రోస్ రైతుసేవ కేంద్రాన్ని ఏడీఏ పుణ్యవతితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఓ బాల్‌రెడ్డి, ఏఈఓ రమ్య, ఏఎస్ఓ వెంకటేశం, ఆగ్రోస్ యజమాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ సంక్షేమ పథకాలపై ఊరూరా ప్రచారం
అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరు సంక్షేమ పథకాలపై ఊరూరా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అల్లాదుర్గం మండలంలో సీడబ్ల్యూసీ మెంబర్, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఆరు సంక్షేమ పథకాలకు చెందిన ప్లెక్సీలను ఏర్పాటు చేశారు. నాయకులు శ్రీశైలం, బాలకిషన్, మహేశ్, సదానందం, అభిలాశ్‌రెడ్డి ఉన్నారు.

◆ ఉపాధి పనులు ఆన్‌లైన్ చేయాలి
చిన్నశంకరంపేట(మెదక్): పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ పనులను త్వరగా ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఉపాధి పనులపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిధర్, ఉపాధి హామీ ఏపీఓ వెంకటసాయి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ రక్తదాన శిబిరం
మెదక్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకొని జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మోర్చా నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ, మధు, సుభాష్‌చంద్రాగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి భానుచందర్, సతీష్, మండల యువమోర్చా అధ్యక్షులు హరీష్, రాజు, రాహుల్, మండల అధ్యక్షుడు రాజు, అధ్యక్షుడు నాని ,ప్రసాద్ నాయకులు శివ, సంకోజు రాజు, నాగ ప్రభువు గౌడ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.